క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే


వాడ్రాపల్లిలో జగనన్న ఆరోగ్య సర్వే ఫారం అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక:జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా కలుగుతుందని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. సర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాడ్రాపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సంబంధిత ఫారంలను అందజేశారు. ఈ నెల 30 నుంచి సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

26న విభిన్న ప్రతిభావంతులకు గుర్తింపు శిబిరం


ఎంపీడీవో మన్మథరావు

మునగపాక : ఈ నెల 26న అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు, సహాయక పరికరాల పంపిణీ కొరకు గుర్తింపు శిబిరం జరుగుతుందని ఎంపీడీవో మన్మథరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులకు వివరాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. మూడేళ్ల కాలంలో ఎటువంటి ఉపకరణాలు తీసుకోలేని అభ్యర్థులు అర్హులన్నారు. ఈ శిబిరం కేవలం సహాయక ఉపకరణముల కొరకు గుర్తింపు మాత్రమే అని, ఎటువంటి వైద్య ధ్రువీకరణ పత్రాలు గాని పింఛన్‌లు కానీ మంజూరు చేయబడవని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మన్మథరావు కోరారు.

ఆరు గ్రావెల్ లారీలు సీజ్


రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన గ్రావెల్ లారీలు

ఎస్.రాయవరం : బిల్లు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న ఆరు టిప్పర్లను రెవెన్యూ సిబ్బంది పట్టుకుని సీజ్ చేసినట్టు తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. యచ్చర్ల నుంచి అచ్చుతాపురం వైపు వెళ్లాల్సిన టిప్పర్లు ఎస్.రాయవరం తహసీల్దార్ కార్యాలయం వైపు రావడంతో రెవెన్యూ సిబ్బంది తనిఖీలు నిర్వహించామన్నారు. గ్రావెల్ తరలింపునకు అవసరమయిన అనుమతులు సక్రమంగా లేవని, పైగా ఎస్.రాయవరం మండలానికి మట్టి తరలించేందుకు ఏ అనుమతులు లేని కారణంగా ఆరు లారీలను సీజ్ చేశామన్నారు. తదుపరి చర్యలకు గాను మైన్స్ అధికారులకు నివేదిక ఇచ్చామన్నారు.

సొంత స్థలం ఉంటే ఇళ్ల స్కీం..


గృహనిర్మాణ శాఖ కమిటీతో సర్పంచ్ వెంకటరమణ

ఎస్.రాయవరం : ప్రతి కుటుంబానికి స్వంత ఇల్లు ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని పెదఉప్పలం సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ అన్నారు. పెదఉప్పలం శివారు చిన ఉప్పలం గ్రామంలో గురువారం గృహ నిర్మాణ శాఖ కమిటీ కలిసి పలు గృహాలను సందర్శించారు. సొంత స్థలం ఉండి ఇళ్ల స్కీమ్ రాని వారికి నిధులు మంజూరు చేసేందుకు తనిఖీ నిర్వహించారు. ఇప్పటికే మండలంలో ఇంటిస్థలం, ఇళ్ల స్కీములు వేల సంఖ్యలో ఇచ్చిన సంగతి తెలిసిందే. అదే క్రమంలో సొంత స్థలాల్లో నిర్మాణాలు చేసుకునేవారికి స్కీమ్‌లు ఇచ్చేందుకు సర్వే నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ కుమార్, గృహనిర్మాణ శాఖ ఏఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

రాంబిల్లి : మండలంలో ఇంకా ఈ క్రాప్ నమోదు చేసుకుని రైతులు ఆర్‌బీకేలను సంప్రదించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. వరినాట్లు పూర్తయిన గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు చివరి దశకు చేరినట్టు ఏవో సుమంత తెలిపారు. ఇంకా పూర్తి కాకపోతే సంబంధిత వీఏఏలు, వీహెచ్‌ఏలను సంప్రదించాలని ఆమె సూచించారు.

ఇంటింటికీ రక్షిత నీటికి భరోసా

- జల్‌జీవన్ మిషన్ కింద రూ.19.3 కోట్ల కేటాయింపు
- చురుగ్గా ఇంటింటికీ కుళాయి పనులు
- మండల వ్యాప్తంగా 70 పనులకు శ్రీకారం


మడకపాలెంలో నిర్మాణం పూర్తయిన రక్షిత మంచినీటి పథకం


జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటి ఆవరణలో కుళాయి

మునగపాక : ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించడంతో పాటు తాగునీటి సమస్య తలెత్తకుండా పరిష్కరించేందుకు ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ఏటా వేసవి కాలం వచ్చిందంటే చాలు తాగునీటి సమస్యను ఎదుర్కోవాల్సిందే. కొన్నిసార్లు తాత్కాలికంగా సమస్యలు పరిష్కరించి తర్వాతా గాలి కొదిలేసేవారు. సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పలు చోట్ల రక్షిత మంచినీటి పథకాలు, అవసరం మేర బోర్లను అందుబాటులోకి తీసుకు వస్తున్నారు.

ఇంటింటికీ పరిశుభ్రమైన నీరు

జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిల ద్వారా పరిశుభ్రమైన నీటిని సరఫరా చేసేందుకు గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటికే కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న వారి వివరాలు సేకరించారు. అలాగే ఇంకా ఎన్ని కుటుంబాలకు కుళాయిల ద్వారా తాగునీరు అందించాలనే వివరాలు సేకరించారు. అందుకు అనుగుణంగా నిధుల కేటాయింపు చేపట్టారు. ఇప్పటికే ఉన్న సీపీడబ్ల్యు స్కీమ్‌లతో పాటు రక్షిత మంచినీటి పథకాలు, వాటి సామర్థ్యం తదితర వివరాలను సేకరించారు. అలాగే అదనంగా రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను సైతం అధికారులు గుర్తించడం పనులు చేపట్టడం జరుగుతోంది.

మూడు దశలుగా కుళాయి పనులు

మునగపాక మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.19.3 కోట్లకు పైగా నిధులు కేటాయించారు. కొన్ని గ్రామాలకు సంబంధించి టెండర్లు పూర్తికాగా మరికొన్ని చోట్ల రీ టెండరింగ్ పనులు జరుగుతున్నాయి. మండలాన్ని మూడు ఫేజ్‌లుగా విభజించారు. ఫేజ్–1లో 13 పనులకుగాను రూ.309.5 లక్షల మేర నిధులు కేటాయించారు. అలాగే ఫేజ్–2లో 25 పనులకు సంబంధించి రూ.746.74 లక్షలు కేటాయించారు. ఫేజ్–3లో 28 పనులకుగాను రూ.895.6 లక్షలను కేటాయించారు. ఇక్కడ 28 పనులకు, ఫేజ్–2లో 4 పనులకు వెరసి 32 పనులకు రీ టెండర్ల ప్రక్రియ జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది మార్చికల్లా తాగునీటి సమస్య రాకుండా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు పూర్తయ్యేలా అధికారులు ప్రణాళికలు చేపట్టారు.

తాగునీటి కష్టాలకు చెక్



జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నారు.

–ఇల్లా శిరీష, ఎంపీటీసీ, కాకరాపల్లి

చురుగ్గా పైపులైను పనులు



జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ పరిశుభ్రమైన తాగునీరు సరఫరా అవుతుంది. దీనికి తోడు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండదు. వేసవిలోగా గ్రామాల్లో కుళాయిల ఏర్పాటు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని చోట్ల పైప్‌లైన్ పనులు పూర్తికాగా మరికొన్ని చోట్ల రక్షిత పథకాలు నిర్మిస్తున్నాం. అవసరం మేర బోర్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. –ఉమామహేష్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ

గురజాడ రచనలు స్ఫూర్తిదాయకం


పెదబోదుగల్లం హైస్కూల్లో గురజాడ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు


గురజాడ కళాక్షేత్రంలో గురజాడ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ వీసీ ముత్యాలనాయుడు

ఎస్.రాయవరం : దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని చాటి చెప్పిన మహా సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కోన లోవ లక్ష్మి అన్నారు. గురజాడ జయంతిని పురస్కరించుకుని గురజాడ జన్మస్థలమైన ఎస్.రాయవరంలో గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గురజాడ పుట్టిన మండలానికి జిల్లాకి ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కృషి చేస్తానన్నారు. దేశ విదేశాల్లో కీర్తించబడ్డ గురజాడ నవలలు, నాటికలు నేటి తరానికి తెలిసేలా విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. కాగా గురజాడ జయంతిని పురస్కరించుకుని నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ముర్రు ముత్యాలనాయుడు గురువారం ఎస్.రాయవరంలో గురువారం గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, గురజాడ ఫౌండేషన్ సభ్యులు కర్రి వెంకటేశ్వరరావు, కందుల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి పాల్గొన్నారు.

నక్కపల్లి : పెదబోదుగల్లం హైస్కూల్లో నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు 161 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రాంధిక బాషను నిరసించి వ్యవహారిక భాష కోసం ఉద్యమం నడిపినవారిలో అగ్రగణ్యుడు గురజాడ అని అన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎన్‌వీఎస్ ఆచార్యులు మాట్లాడుతూ సృజనాత్మక సాహిత్యంలో వినూత్నమైన రచనలు చేసిన కవి గురజాడ అని, కవిగా, నాటకకర్తగా, భాషాభిమానిగా, దేశాభిమానిగా స్థానం సంపాదించుకున్న వ్యక్తి అని కొనియాడారు. ఉపాధ్యాయులు ఎస్.ఫాల్గుణ, కుమారి, చిన్నారావు, రమేష్‌బాబు, శ్రీదేవి పాల్గొన్నారు.

30 లోగా మట్టి, బియ్యం తరలించాలి

మునగపాక : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన నా భూమి–నాదేశం కార్యక్రమంలో భాగంగా ఇంతవరకు గ్రామాల్లో మట్టి, బియ్యం సేకరించారని, సంబంధిత సామాగ్రిని 30వ తేదీలోగా మండల పరిషత్ కార్యాలయానికి తరలించాలని ఎంపీడీవో మన్మథరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూ గ్రామాల్లో మట్టి సేకరణ,బియ్యం సేకరణ సక్రమంగా పూర్తి చేయాలన్నారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు, ఏవో ప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు.

మునగపాక ఈవోఆర్డీగా వెంకటలక్ష్మి

మునగపాక: మునగపాక మండల ఈవోపీఆర్డీగా పి.వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు డీపీవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. గతంలో మునగపాక మండల ఈవోపీఆర్డీగా పనిచేసిన ప్రసాద్‌ను కె.కోటపాడుకు బదిలీ చేయడంతో మునగపాక పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న పీవీఎల్ఎన్ ఈశ్వరరావుకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. కశింకోట మండలం తాళ్లపాలెం పంచాయతీలో గ్రేడ్–1 అధికారిగా పనిచేస్తున్న వెంకటలక్ష్మిని మునగపాక ఈవోఆర్డీగా నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. వెంకటలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నట్టు తెలిసింది.

క్రీడా ఆణిముత్యాల వెలికితీతకు చక్కటి వేదిక

- ఉత్సాహంగా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు


వాలీబాల్ పోటీలు ప్రారభిస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు


జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన పాములవాక విద్యార్థులు

యలమంచిలి : క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన గురువారం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మట్టిలో మాణిక్యాల వలే విద్యార్థులు ప్రతిభ నిరూపించుకోవడానికి ఇది ఒక చక్కటి వేదిక అని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నారని తెలిపారు. ప్రతిభవంతులైన క్రీడాకారులకు స్పోర్ట్సు కోటాలో ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో యోగా పోటీలలో రాణించిన లయవర్ధన్‌ను అభినందించారు. నిష్పక్షపాతంగా ఎంపికలు నిర్వహించి ప్రతిభావంతులను గుర్తించి పోటీలు జరిగేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, కొత్తలి వైఎస్సార్ సీపీ నాయకుడు మర్రిరాజు, నాలుగు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

కోటవురట్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. అండర్ 14, అండర్ 17 విభాగాలలో 9 కేటగిరీలకు సంబంధించి క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. పాయకరావుపేట నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీలలో నాలుగు మండలాలకు సంబంధించి సుమారు 700 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధిస్తారు.

సత్తా చాటిన పాములవాక విద్యార్థులు

నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో పాములవాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పలు విభాగాలలో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్ 17 విభాగం త్రోబాల్‌లో ఎ.శ్రీరాముడు, బాల్ బ్యాడ్మింటన్‌లో ఇ.హేమంత్‌కుమార్, జి.ఇందువదన్, ఎ.శేషాద్రినాయుడు, అండర్ 14 విభాగం వాలీబాల్ ఎస్.దుర్గాప్రసాద్, ఎస్.భవానీ ప్రసాద్, కబడ్డీ బి.సాయిగణేష్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. క్రీడాకారులను హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ అచ్యుతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.


ఖోఖో పోటీల్లో తలపడుతున్న బాలికలు

ఆరోగ్య సురక్షపై అవగాహన


పంచదార్లలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాంబిల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని దిమిలి పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి రాజు అన్నారు. పంచదార్లలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించి ఇంటింటికీ వెళ్లి సర్వే చేయడంతో పాటు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చేపట్టే వైద్య సేవలపై రాజు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అమ్మాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి : జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు గోసలా కాసులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి అన్నారు. గురువారం రాజయ్యపేట, అమలాపురం, ఉపమాక తదితర గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. వైద్యసిబ్బంది, వలంటీర్లు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వచ్చి ఆరోగ్య సమాచారం సేకరిస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు నమోదు చేసుకుంటారన్నారు. వీరందరికీ వైద్యనిపుణులతో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు తాతారావు, పార్టీ నాయకులు నాగేష్, గోవింద్, జేసీఎస్ కన్వీనర్ వియ్యపు శ్రీను పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో వినాయకుని సారె ఊరేగింపు


మునగపాకలో వినాయక విగ్రహాన్ని దర్శించుకుంటున్న ఎస్ఐ అలీ


వాడ్రాపల్లిలో వినాయకుని సారె ఊరేగింపు

మునగపాక: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వాడ్రాపల్లిలో గురువారం వినాయకునికి సారె ఊరేగింపు నిర్వహించారు. నోరూరించే వంటకాలు తయారు చేసి వినాయకునికి సమర్పించారు. మునగపాకలో డేంజర్‌గాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అశ్లీల నృత్యాలకు తావు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని అలీ కోరారు.

పాల వ్యాను నిలిచిపోయి ట్రాఫిక్‌కు ఆటంకం


యండపల్లి వంతెనపై అడ్డుగా నిలిచిపోయిన పాల వ్యాను


వ్యానును క్రేన్‌తో తొలగిస్తున్న దృశ్యం

కోటవురట్ల : యండపల్లి వంతెనపై పాలవ్యాను నిలిచిపోవడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. గురువారం ఉదయం 7 గంటల సమయంలో నర్సీపట్నం నుంచి కోటవురట్ల వస్తున్న పాల వ్యాను వరాహనదిపై ఉన్న శిథిల వంతెనపైకి ప్రవేశించే సమయంలో మరమ్మతుకు గురికావడంతో నిలిచిపోయింది. వాహనాలు వెళ్లేందుకు దారి లేకపోవడంతో వంతెనకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సుమారు 2 గంటల పాటు వాహనాలు నిలిచిపోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నారాయణరావు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. క్రేన్ ద్వారా వ్యానును వెనక్కి లాగి వాహనాల రాకపోకలకు వీలు కల్పించారు.

23న నర్సీపట్నంలో దళిత ప్రతినిధుల 'గర్జన'


గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక : ఈ నెల 23న నర్సీపట్నంలో దళిత ప్రతినిధుల గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళితసేన పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి రేబాక మధుబాబు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం మునగపాక దళితవాడలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అట్రాసిటీ చట్టంలోని 41 ఏ నోటీసు రద్దు చేయాలని, రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయడంతో పాటు దళితులపై దాడులను అరికట్టాలని అన్నారు. అలాగే దళితులకు కేటాయించిన నిధులను వారికే అందించేలా చూడాలన్నారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఇద్దరు దళిత ప్రతినిధులను ఎంపిక చేసుకొని త్వరలో చర్చా వేదిక నిర్వహిస్తామన్నారు. డీఎస్‌పీ, జీకేఎస్ఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఈ గర్జన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జైభీం సేన సేవాసంఘ జిల్లా కార్యదర్శి బీలా శివగణేష్, ఎం.శివప్రసాద్, ఎం.మహేష్, సీతారామ్, వినోద్, అర్జున్, పవన్, పండు పాల్గొన్నారు.

గురజాడ రచనలతో సాంఘిక పరివర్తన


శాఖా గ్రంథాలయంలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు కృషి చేసిన మహాకవి అని ఇంగ్లిష్ టీచర్ ఎ.డేనియల్ అన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం గురజాడ అప్పారావు 161వ జయంతిని నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశమును ప్రేమించుమన్న అనే గురజాడ రచన ఎంతో ప్రసిద్ధి గాంచిందని తెలిపారు. లైబ్రేరియన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ గురజాడ అప్పారావు కవితలను, రచనలను నేటి తరం విద్యార్థులు చదివి స్ఫూర్తి పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్ద రాజు సాయి,వెంకట్, పాఠకులు పాల్గొన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



సంతకాలు సేకరిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ముఠా కార్మికులు

అచ్యుతాపురం(అనకాపల్లి): ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ ముఠా కార్మికులకు కనీస వేతనాలు, నిర్దిష్ట పని గంటలు కల్పించాలని కోరారు. ముఠా కార్మికుల వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నెల 27న అచ్యుతాపురం చేరుకొనే ఉత్తరాంధ్ర ఉక్కు పరిరక్షణ బైక్ యాత్రలో ముఠా కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.చెంచమ్మ, జోగినాయుడు, పి.రాజు, కె.రామకృష్ణ, కోనారి పాల్గొన్నారు.

ఆంజనేయ వాహనంపై వెంకన్న తిరువీధి సేవ


ఆంజనేయ వాహనంపై స్వామివారి తిరువీధి సేవలు

నక్కపల్లి: మండలంలో ఉపమాక క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆంజనేయ వాహనంపై ఉపమాక వెంకన్న తిరువీధి సేవ ఘనంగా జరిగింది. పాంచరాత్ర ఆగమానుసారం ఈ ఏడాది దాతలు, భక్తుల సహకారంతో ఉపమాక ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు. దీనిలో భాగంగా ఉదయం కొండపైన , కింద ఉన్న ఆలయాల్లో స్వామివారికి ఆలయ అర్చకుల బృందం ప్రత్యేక పూజలు బాలభోగ నివేదినలు ప్రత్యేక హోమాలు, సుదర్శన పెరుమాళ్ వారి పల్లకి సేవతో గ్రామ బలిమరణలు పూర్తి చేసిన తర్వాత ప్రత్యేక హారతులు సమర్పించారు. అనంతరం ఆంజనేయ వాహనంపై ఉభయ దేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చకులు సంకరక్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవంతం సాయి, గోపాలాచార్యులు, నందూరి రాజు గోపాలాచార్యులు, రేజేటి సింగరాచార్యులు, ఆఫీస్ అసిస్టెంట్ గురవయ్య, శ్రీవత్స తాతాజీ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు

రాంబిల్లి: విభిన్న ప్రతిభావంతులు(దివ్యాంగులు)కు ప్రభుత్వం ఉచితంగా ఉపకరణములు అందజేస్తుందని ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు తెలిపారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సూచనల మేరకు ఈ నెల 28న యలమంచిలి డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.